క్లుప్తంగా

సీపీఐ విరాళాల సేకరణ



నెల్లూరు (వేదాయపాళెం): నగరంలోని రేబాలవీధిలో భారత కమ్యూనిస్టు పార్టీ విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాటాలకు ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు సేకరిస్తున్నామని తెలిపారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్‌కిషోర్, నాయకులు సురేంద్ర, సాంబయ్య, నాగయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు కోరారు. వికసిత భారత సంకల్ప యాత్రలో భాగంగా నగరంలోని బ్రహ్మానందపురంలోని అంబేడ్కర్‌నగర్, గాంధీబొమ్మ సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వ పథకాలపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి, రాధాకృష్ణగౌడ్, రాజేశ్వరి, రవిశంకర్, కార్పొరేషన్ సెక్రటరీ హేమావతి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన ముగ్గురు బాధితులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.38 లక్షల చెక్కులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. మర్రిపాడు మండల మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, బూత్ కమిటీ మేనేజర్ రేవూరు వేణుగోపాల్‌రెడ్డి, ఏఎస్‌పేట జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

తమిళనాడుకు కంటైనర్ టెర్మినల్

నెల్లూరు సిటీ: కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తమిళనాడుకు తరలిపోతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటైనర్ టెర్మినల్ తరలిపోతే పదివేల మంది ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.1000 కోట్ల మేర ట్యాక్స్ కోల్పోతుందన్నారు. సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వ అనుమతులతో ఇలాంటి పరిస్థితి నెలకొనడం అన్యాయమన్నారు. పోర్టును కాపాడేందుకు అఖిలపక్ష పార్టీలతో కలిసి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

11న ఘంటసాల కళానీరాజనం

నెల్లూరు(బృందావనం): అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావును స్మరిస్తూ కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని పురమందిరంలో ఫిబ్రవరి 11న ఘంటసాల కళా నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. శనివారం పురమందిరం ప్రాంగణంలో కార్యక్రమ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధమాన, ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన కళాకారులు ఈ నెల 30లోగా 77299 42543 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీ రఘురామిరెడ్డి, వీ మహేష్, వీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నారాయణకు సేవా గుణం లేదు

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నారాయణకు సేవా గుణం లేదని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అన్నారు. నగరంలోని 52వ డివిజన్ రంగనాయకులపేటలోని గురుతోట, ఇసుకడొంక, తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ 52వ డివిజన్‌లో ఇంకా కొన్ని అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరానికి చుట్టపు చూపుగా వచ్చే, నగరంలోని చిన్నచిన్న ప్రైవేట్ స్కూళ్లను నాశనం చేసిన నారాయణ మున్సిపల్ పాఠశాలలను తానే అభివృద్ధి చేశానని చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుతం తమ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు పిలిస్తే ఎక్కడ నిజాలు బయటపడతాయోనని స్పందించడం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత మున్సిపల్ పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశామని వివరించారు. మెడికల్ కళాశాల, ఆస్పత్రి పాటు ఎన్నో విద్యా సంస్థలు నడుపుతున్న నారాయణ ఏ ఒక్కరికైనా ఉచిత విద్య, వైద్యం అందించారాని ప్రశ్నిస్తున్నామన్నారు. ఆయనకు ఎంతో మందికి ఉచితంగా విద్య, వైద్యం అందించగలిగే పరిస్థితి ఉన్నా ఏ ఒక్కరికి సాయం అందించిన దాఖలాలు లేవన్నారు. అలాంటి ఆయన నగరాన్ని, నగర ప్రజలను ఉద్ధరిస్తానని తిరుగుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వేల కోట్లు ఉన్నాయి..ఎన్నికల్లో గెలుస్తాం.. లేదంటే కనిపించకుండా పోదామనే ఆలోచనతో ఉన్న ఆయనకు సేవా గుణం ఎలా వస్తుందన్నారు. నారాయణకు 70 ఏళ్లు ఉంటాయని, ఇన్నేళ్లు లేని సేవా గుణం ఇప్పుడు వస్తుందా అని ప్రశ్నించారు. టీడీపీ మోసాలు, అబద్ధాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు కలిసిరావడం తప్ప సింగిల్‌గా రాలేని వారంతా ఆయన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ షేక్ అస్మా, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేసీ, అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అవసరమైన సత్వర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ సూచించారు. శనివారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబంలో ఏ వ్యక్తి అయినా ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం చిన్నాభిన్నమవుతుందని, వాహనాలను నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రాణాలను రక్షించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మద్యం తాగి వాహనాలను నడపడం ప్రమాదరకమని, హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని తెలిపారు. దేశంలో ప్రమాదాల బారిన పడి మరణించే వారి సంఖ్య ప్రతి సంవత్సరం ఎక్కువవుతుండడంతో ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం, నేషనల్ హైవే అథారిటీ రోడ్డు భద్రతా వారోత్సవాలను మాసోత్సవాలుగా మార్చి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చందర్ మాట్లాడుతూ నెల రోజులపాటు లారీ డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. తొలుత కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లను ఆవిష్కరించారు. ఏఎస్పీ ఏవీఆర్పీ బి.ప్రసాద్, డీఎస్పీ అబ్దుల్ సుభాన్, సిటీ ప్లానింగ్ అధికారి దేవికుమారి, ఇన్‌చార్జి ఆర్టీఓ మురళి, ఆర్టీసీ ఆర్‌ఎం శేషయ్య, డీటీసీ సురేష్‌బాబు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

3న జగన్నాథ రథయాత్ర



మాట్లాడుతున్న సుఖదేవ్‌స్వామి

నెల్లూరు(బృందావనం): అంతర్జాతీయ శ్రీకృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలో ఫిబ్రవరి 3న 11వ జగన్నాథ (గౌర–నితాయ్) రథయాత్ర నిర్వహించనున్నట్లు ఇస్కాన్ జిల్లా శాఖ అధ్యక్షుడు సుఖదేవ్‌స్వామి తెలిపారు. ఇస్కాన్‌సిటీలోని 'ఇస్కాన్' మందిరంలో రథయాత్ర ఆహ్వాన పత్రికలను రథయాత్ర కన్వీనర్ డీవీఎస్ గిరి, సభ్యులు చిన్నయ, జ్యోతితో కలిసి శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుఖదేవ్‌స్వామి మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సహకారంతో రథయాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే నెల 3న మధ్యాహ్నం 2.30గంటలకు సంతపేటలోని నాలుగు కాళ్ల మండపం నుంచి ప్రారంభమయ్యే యాత్ర వీఆర్సీ సెంటర్, ముత్తుకూరుగేట్ సెంటర్, అన్నమయ్య సర్కిల్ మీదుగా పీవీఆర్ కల్యాణ మండపానికి రాత్రి 7 గంటలకు చేరుకుంటుందని తెలిపారు.

రేపు బాలరాముని ప్రతిష్ట సందర్భంగా విశేష పూజలు



మాట్లాడుతున్న కమిటీ ప్రతినిధులు

నెల్లూరు(బృందావనం): శ్రీరామ జన్మభూమి అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా శ్రీరామ మందిర ఉత్సవ పర్యవేక్షణ కమిటీ నగర శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఆలయాలు, మందిరాల్లో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ కమిటీ నెల్లూరు ప్రతినిధులు వెల్లడించారు. గాంధీబొమ్మ సమీపంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. నగరంలోని ఆలయాలు, మందిరాల్లో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీరామచంద్రమూర్తి భజనలు, కీర్తనలు, కోలాటాలు, అభిషేకాలు, పూజలు, విష్ణు సహస్రనామ, హనుమాన్ చాలీసా, సుందరకాండ, రామ రక్షాస్తోత్రం సామూహిక పారాయణం నిర్వహించనున్నట్లు వివరించారు. అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ట ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారానికి ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కమిటీ నగర అధ్యక్షుడు మోదం మల్లికార్జునరావు, పర్యవేక్షకులు పీ సురేందర్‌రెడ్డి, వీహెచ్‌పీ విభాగ కార్యదర్శి ఏవీఆర్ మోహన్‌రావు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ కొండపల్లి శ్రీకాంత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్ వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీకృష్ణ,అష్టలక్ష్మి మందిరంలో..

బాలరాముడి ప్రతిష్ఠ సందర్భంగా సుజాతమ్మకాలనీలోని శ్రీకృష్ణ అష్టలక్ష్మి మందిర ప్రాంగణంలో సోమవారం సాయంత్రం 5.30గంటలకు సహస్ర దీపోత్సవం నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ జ్ఞానబోధ సభ నెల్లూరు శాఖ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ శనివారం తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

నెల్లూరు రూరల్ : ధనలక్ష్మీపురంలోని జెడ్పీ హైస్కూల్లో ఆదివారం ఉదయం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు విజయభాస్కర్ శనివారం తెలిపారు. యువకులు రక్తదానం చేయాలని కోరారు.

రేపట్నుంచి ధర్మప్రచార వారోత్సవాలు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ఈఓ వెంకటేశ్వర్లు, చైర్మన్ మంచికంటి

నెల్లూరు(బృందావనం): దేవదయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు నగరంలోని ఆలయాల్లో నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ సహాయసహకారాలతో ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు రంగనాథస్వామి దేవస్థానం ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తెలిపారు. శనివారం దేవస్థానంలోని సాంస్కృతిక మందిరంలో ఆహ్వానపత్రికలను ధర్మకర్తల మండలి సభ్యులు సాదా గోపి, వీరేపల్లి పద్మజతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా 22న శెట్టిగుంటరోడ్డు సత్రంబడి, 23న నవాబుపేటలోని ఉదయవర్ల దేవస్థానం, 24న పెద్దబజారుసెంటర్, 25న బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరం, 26న సంతపేట, 27న పప్పుల వీధిలోని ఆంజనేయస్వామి దేవస్థానాలు, 28న రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి ధర్మప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

రంగనాథస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ డీ వెంకటేశ్వర్లు, చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తెలిపారు. నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని చెప్పారు.

ప్రణాళికాబద్ధంగా కులగణన



నెల్లూరు(బారకాసు): కుల గణనను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ సచివాలయ కార్యదర్శులకు సూచించారు. నగరంలోని ఆకుతోట, మాగుంట లేఅవుట్, న్యూమిలటరీ కాలనీ–1, కోనేటిమిట్ట వార్డు సచివాలయాలను కమిషనర్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

'ఆడుదాం ఆంధ్రా' టోర్నమెంట్‌లో మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయికి అర్హత సాధించిన క్రీడాకారులకు కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ ప్రొఫెషనల్ కిట్లను అందజేశారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానంలో జరుగుతున్న పోటీలను శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో ఉన్నత స్థానాలకు చేరుకున్న నగరానికి చెందిన మూడు జట్లకు నాణ్యమైన క్రీడా కిట్లను అందజేసి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అదనపు కమిషనర్ శర్మద, టీపీఆర్వో ప్రసాద్, వివిధ విభాగాల సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, క్రీడా కోచ్‌లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్ : నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెంలోని డొల్ల డెయిరీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన కళ్యాణ్‌కుమార్ (32) చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు నెల్లూరు రూరల్ సీఐ సుబ్బారావు తెలిపారు. ఈ నెల 15న డొల్ల డెయిరీలో బాయిలర్ ట్యాంక్‌లోని నీరు పడడంతో కళ్యాణ్‌కుమార్‌తో పాటు మరి కొందరు గాయపడ్డారు. కల్యాణ్‌కుమార్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన వ్యక్తులకు చిన్నపాటి గాయాలు కావడంతో కోలుకున్నారని వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాత స్టాంపులు, చెక్కుల దహనం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా ఖజానా కార్యాలయంలోని స్ట్రాంగ్ రూములో భద్రపరిచిన పాత స్టాంపులు, చెక్కులను రెవెన్యూ, ఖజానా, రిజిస్ట్రేషన్, అగ్నిమాపక శాఖ అధికారుల సమక్షంలో శనివారం దహనం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ గంగాద్రి, ఏటీఓ లోకేష్, తదితరుల సమక్షంలో కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా ఖజానా కార్యాలయం సమీపంలో ఈ ప్రక్రియను నిర్వహించారు.

స్వచ్ఛతీర్థం

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వ గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచనల మేరకు నగర పాలక సంస్థ పరిధిలో 'స్వచ్ఛతీర్థం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ పార్కు సాయిబాబా మందిరం, రాజరాజేశ్వరిదేవి , రంగనాథస్వామి దేవస్థానం ప్రాంగణాలను శుభ్రం చేసి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. ఏఈలు చాణిక్య, అర్పిత, సాయికృష్ణ, సచివాలయాల అమెనిటీస్, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిశుద్ధ తాగునీటి సరఫరాకు నిరంతర పర్యవేక్షణ



మంచినీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): నగరంలోని 31 ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను నగర మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ ఆదేశించారు. ఇటీవల పలు డివిజన్లలోని ప్రజలు తాగునీటి సమస్యను విన్నవించడంతో పరిష్కరించేందుకు సంగం బ్యారేజ్ వద్ద ఉన్న మంచినీటి శుద్ధి కేంద్రాన్ని కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసయాదవ్, కువ్వాకుల విజయలక్ష్మి, కార్పొరేషన్ అధికారులతో కలిసి మేయర్ శనివారం పరిశీలించారు. కేంద్రం పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి శుభ్రత ప్రమాణాలను వంద శాతం పాటించాలన్నారు. నగరానికి మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యత



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): రోడ్డు భద్రత అందరి బాధ్యతని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆత్మకూరు ఎంవీఐ రాములు, కూనం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శనివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

బాలిక సంరక్షణా చట్టాలపై అవగాహన



నెల్లూరు (టౌన్): జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీపీఎస్ ఆధ్వర్యంలో నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు బాలిక సంరక్షణా చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ బాలిక సంరక్షణా చట్టాలు, సమాజంలో ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఈ నెల 24వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బేటీ బచావో బేటీ పడావో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, ఐసీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేట్రేగిన గొలుసు దొంగలు

నెల్లూరు(క్రైమ్): నగరంలో గొలుసు దొంగలు పేట్రేగిపోయారు. ఒకే రోజు మూడు వేర్వేరు ప్రాంతాల్లో గంట వ్యవధిలోనే మహిళల మెడల్లోని బంగారు గొలుసులను తెంపుకెళ్లారు. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి గొలుసు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

- బాలాజీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి ఇద్దరు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను దొంగలు తెంపుకెళ్లారు. వివరాలు..సరస్వతినగర్‌లో రమణమ్మ తన కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటోంది. శుక్రవారం రాత్రి ఆమె తన ఇంటిముందు నిలబడి ఉండగా ఇద్దరు గుర్తుతెలియని దుండగులు బైక్‌పై ఆమె వద్దకు వచ్చారు. అడ్రస్ అడుగుతున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని ఐదు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. ఈ మేరకు బాధితురాలు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.
- ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సరోజనమ్మ, వెంకటరత్నం దంపతులు. వారికి ఇద్దరు పిల్లలు. సరోజనమ్మ ఇంటి వద్దనే చిల్లర దుకాణం నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి 10గంటల ప్రాంతంలో ఆమె దుకాణంలో ఉండగా గుర్తుతెలియని ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చారు. వాటర్‌బాటిల్ తీసుకుని డబ్బులు ఇస్తున్నట్లు నటిస్తూ ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.
- నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని నాగేంద్రనగర్‌లో రామచంద్ర, అంజలిదేవి దంపతులు నివాసం ఉంటున్నారు. రామచంద్ర నగరంలోని కాకర్లవారివీధిలో కుదువషాపు నిర్వహిస్తున్నారు. వారికి కుమారుడు ఉన్నారు. ఈ నెల 19న రాత్రి ఎదురింట్లోకి ఆడుకునేందుకు వెళ్లిన కుమారుడ్ని తీసుకొచ్చేందుకు అంజలిదేవి ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. ఆ సమయంలో మొహానికి మాస్కులు ధరించిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి బాధితురాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీపుటేజీలను పరిశీలిస్తున్నారు. బాధితురాలు చెప్పిన ఆనవాళ్లున్న పాత నేరస్థులను సైతం విచారిస్తున్నారు.